ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 5 మార్చి 2025

బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌డీఏ పీడీ




పార్వతీపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా సుధారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆమె కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్‌డీఏ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా పీడీకి ఆయన సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు.

రిజర్వ్ ఫారెస్ట్ పరిధి..

కానరాని పర్యాటకాభివృద్ధి

- సీతంపేట ఏజెన్సీలో విచిత్ర పరిస్థితి
- ప్రతిపాదనలకే పరిమితమైన అటవీశాఖ
- ప్రభుత్వ చొరవ చూపుతున్నా.. పనుల్లో పురోగతి నిల్

సీతంపేట రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న పర్యాటక ప్రాంతాలు కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదు. పర్యాటకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నా.. ఆ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు సాగడం లేదు. వాస్తవంగా సీతంపేట ఏజెన్సీలో గుర్తింపు పొందిన సున్నపుగెడ్డ జలపాతం, పొల్ల వ్యూ పాయింట్ అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే అవి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండడంతో అటవీశాఖ అభ్యంతరాలు తెలిపింది. ఆ తర్వాత ఆయా ప్రాంతాల అభివృద్ధికి ముందుకొచ్చిన అటవీ శాఖ నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో వాటి పనులకు మోక్షం లభించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే సున్నపుగెడ్డ జలపాతం అభివృద్ధికి మొదటి విడతలో రూ.15లక్షలు మంజూరు చేసింది. వన సంరక్షణ సమితి(వీఎస్ఎస్)ల ఆధ్వర్యంలో సున్నపుగెడ్డ ప్రవేశ మార్గంలో చెక్కలతో ఆర్చ్‌ను తయారు చేశారు. జలపాతానికి వెళ్లే మార్గంలో పర్యాటకులు సేద తీరేందుకు చెక్కలతో బల్లలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. వాటి పనులు ముందుకు సాగడం లేదు.



అభివృద్ధికి నోచని పొల్ల వ్యూ పాయింట్

ఇదీ పరిస్థితి

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. వాటితో ఇప్పటికే సీతంపేట ఏజెన్సీలో ఆడలి వ్యూ పాయింట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. ఇటీవల ఆ మార్గంలోని ఘాట్ రోడ్డులో ప్రమాదకర మలుపుల వద్ద ఉపాధి నిధులు రూ.102 లక్షలతో రక్షణ గోడలను నిర్మిస్తున్నారు. బెన్నరాయి జలపాతం అందాలను పర్యాటకులకు చేరువ చేసేందుకు ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారి సౌకర్యం కల్పించనున్నారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంటే మరోపక్క అటవీశాఖ ఆధ్వర్యంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. సున్నపుగెడ్డ జలపాతానికి వెళ్లే మార్గంలో ఆర్చ్‌ను ఏర్పాటు చేసి మిగిలిన పనులను నిలిపివేశారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యాటక అభివృద్ధికి గతంలో ఐటీడీఏ ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ. అటవీశాఖ నుంచి అభ్యంతరాలు తలెత్తడంతో గిరిజన సంఘాలు కూడా ఆ శాఖ పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నాయి. మొత్తంగా ఏళ్లు గడుస్తున్నా దోనుబాయి, పొల్ల ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సున్నపుగెడ్డ జలపాతానికి వెళ్లే ప్రవేశ మార్గం ఇలా..

నిధులు వస్తేనే పనులు..


సీతంపేట మన్యంలో రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరవ్వాల్సి ఉందని పాలకొండ డివిజన్ సబ్ డీఎఫ్‌వో సంజయ్ తెలిపారు. ఈ నెలాఖరు నాటికి నిధులు విడుదలైతే వీఎస్ఎస్‌ల ద్వారా

(మిగతా 8వ పేజీలో...)

ఉపాధ్యాయ బదిలీల్లో

అక్రమాలకు చెక్

- కొత్తచట్టం రూపొందిస్తున్న కూటమి ప్రభుత్వం
- ముసాయిదా విడుదల
- ఈ నెల 7వరకు అభ్యంతరాల స్వీకరణ



సాలూరు రూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను క్రమబద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపకల్పనకు ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు ఇష్టానుసారంగా జరిగాయి. సాధారణంగా కౌన్సిలింగ్ పద్ధతి ప్రకారం కాకుండా సిఫారసుల ఆధారంగా బదిలీలు సాగేవి. ఇటువంటి అక్రమాలకు తావులేకుండా ఏటా మే 31 నాటికి బదిలీలు చేపట్టి.. పునఃప్రారంభం నాటికి కొత్త పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరేలా ముసాయిదా సిద్ధం చేసింది. ఏటా బదిలీల ద్వారా ఖాళీ స్థానాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కానున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలో 1469, విజయనగరం జిల్లాలో 2,205 వరకు ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రతిపాదికన టీఐఎస్ (టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం) నమోదు ఆధారంగా ఉపాధ్యాయుల సీనియర్టీ తాత్కాలిక జాబితాను విడుదల చేశారు. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలో గ్రేడ్ టూ హెచ్‌ఎంలు 192 మంది, తెలుగు లాంగ్వేజ్ పండితులు 48, పీఈటీలు 42, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు (ఎల్ఎఫ్ఎల్) 191 మంది, పాఠశాల సహాయకులు బయోలజీ 391, ఆంగ్లం 537, హిందీ 313, గణితం 565, పీడీలు 166, ఫిజికల్ సైన్స్ 374, సోషల్ స్టడీస్ 448, తెలుగు 432, సంస్కృతం 4, స్పెషల్ ఎడ్యుకేషన్ 42 మంది ఉన్నారు. ఎస్జీటీలు 3,764 మంది ఉన్నారు. వీరు కాక మరికొంత మంది టీఐఎస్ డేటాలోకి రాని వారున్నారు.

సమస్యలకు పరిష్కారం

ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం క్షేత్రస్థాయిల్లో అమల్లోకి వస్తే... చాలా సమస్యలకు తెరపడే అవకాశం ఉంది. విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ జరగనుంది. బదిలీలు, ప్రమోషన్లలో సీనియారిటీ జాబితాల్లో అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. భవిష్యత్‌లో సమస్య లేకుండా శాశ్వతమైన సీనియారిటీ జాబితాను విద్యాశాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో మెజార్టీ వర్గాలకు న్యాయం చేకూరే అవకాశాలున్నాయి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, బోగస్ దివ్యాంగు సర్టిఫికెట్లు పెట్టి లబ్ధి పొందాలనుకునే వారికి కూడా చెక్ పెట్టే అవకాశం ఉంది. రెండేళ్లు, మూడేళ్లకు బదిలీలు చేపట్టేవారు. ఇకపై ఏటా నిర్వహిస్తామంటుండడం శుభపరిణామం. దీనిపై మెజార్టీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం లోపాలున్నాయని చెబుతున్నారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని సవరించాలని కోరుతున్నారు.

అన్ని డీఎస్సీల లెక్కలు తేలుస్తూ ...

ఉపాధ్యాయల బదిలీలు, ప్రమోషన్లకు సీనియారిటీ జాబితా ముఖ్యం. గతంలో చాలామంది టీచర్లు తాత్కాలిక అవసరాల కోసం బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధి పొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా నమోదు చేసుకున్నారు. కొందరు తాము అపాయింట్ అయిన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీస్)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో...)



చట్టం తెచ్చేందుకు కసరత్తు

కొంతమంది ఉపాధ్యాయులు బదిలీలకు ముందు ప్రిఫరెన్స్ కేటగిరీలో ఏ మాత్రం వైకల్యం లేకున్నా.. 70శాతం కంటే దివ్యాంగులుగా చూపి ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. వాటి ఆధారంగా ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తిష్ఠ వేస్తున్నారు. ఇలా దీర్ఘకాలిక అనారోగ్యం, దివ్యాంగులుగా కొంతమంది ఉపాధ్యాయులు తప్పుడు పత్రాలతో బదిలీల్లో అడ్డదారులు అనుసరిస్తున్నారు. దీంతో బదిలీల ముందురోజు వరకూ సీనియర్‌గా ఉన్న ఉపాధ్యాయులు.. ఉన్నఫలంగా జూనియర్‌గా మారిపోతారు. అర్హులైన వారికి దగ్గరి ప్లేస్‌లు దొరకవు. ఎప్పుడు పడితే అప్పుడు షెడ్యూల్ మేరకు బదిలీలు జరుగుతాయన్న నమ్మకం కూడా ఉండదు. విద్యా సంవత్సరం మధ్యలోనో, ఆఖర్లోనో ఉన్న పలంగా బదిలీ చేస్తారు. కోర్టు కేసుల వల్ల ఒక్కో జిల్లాలో ఒక్కోలా ప్రమోషన్లు సాగుతాయి. కొన్ని ఆగిపోతాయి కూడా. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం బదిలీల నియంత్రణ చట్టం-2025 అమలులోకి తెచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే బదిలీల డ్రాఫ్ట్ విడుదల చేసింది. ఈనెల 7 వరకూ ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ అభ్యంతరాలు స్వీకరించనుంది. ఈ చట్టానికి ముందు టీచర్ల సీనియారిటీ జాబితాల్లోని లోపాలను సరిచేస్తోంది.

చట్టబద్ధత హర్షణీయం



ఉపాధ్యాయుల బదిలీలకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయం. ఇదే సమయంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చట్టం తీసుకురావాలి. పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుంటే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. హేతుబద్ధీకరణ చేసే సమయంలో ఆయా ఉపాధ్యాయులు అదే మండలంలో ఉండేటట్టు చర్యలు తీసుకోవాలి.

- నల్లా బాలకృష్ణ, ఏపీటీఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆఫ్‌లైన్‌లో జరిగేలా..



బదిలీలకు చట్టం తీసుకురావడం స్వాగతించదగ్గ విషయమే. అయితే కౌన్సిలింగ్ ఆఫ్‌లైన్‌లో జరిగేలా చూడాలి. దీనివల్ల బదిలీల్లో తగిన నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉపాధ్యాయులకు ఉంటుంది. రాజకీయ ప్రమేయం లేకుండా, సిఫారసులకు చోటు లేకుండా పారదర్శకంగా బదిలీలు జరిగేలా చూడాలి.

- బి.విజయకుమార్, యూటీఎఫ్ జిల్లా సహా అధ్యక్షుడు

సీనియార్టీ లెక్కించాలి



పదోన్నతుల మాదిరిగా బదిలీలకు సీనియార్టీ లెక్కించాలి. డీఎస్సీల్లో వచ్చిన ర్యాంకు, రోస్టర్ పాయింట్లు ఆధారంగా పాయింట్లు కేటాయించాలి. రేషనలైజేషన్‌లకు గురయ్యే ఉపాధ్యాయులను మండల స్థాయిలోనే సర్దుబాటు చేసే విధంగా చట్టం రూపొందించాలి.

- నాలి చంద్రశేఖర్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నామినేటెడ్‌పై ఆశలు

- సీఎం హామీతో టీడీపీ జిల్లా శ్రేణుల్లో సరికొత్త జోష్

పార్వతీపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులను ఈ నెలాఖరులోగా భర్తీ చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు. పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియ కూడా మే నెలలో జరిగే మహానాడు నాటికి పూర్తిచేయనున్నట్లు ఇటీవల స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారిని, సమర్థులను నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయాలని శాసనసభ్యులకు సూచించడంతో టీడీపీ జిల్లా నాయకులు, కార్యకర్తల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆశావహు లంతా జిల్లా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈ సారి 'నామినేటెడ్' జాబితాలో తమ పేరు ఉండేలా చూడాలని కోరుతున్నారు. కాగా జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాం నియోజకవర్గాలో మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అదే విధంగా తోటపల్లితో పాటు మిగిలిన ప్రముఖ దేవాలయాలకు కమిటీలను ప్రకటించాలి. డీసీసీబీకి సంబంధించి ఛైర్మన్‌తో పాటు నూతన జిల్లాలో మరెన్నో నామినేటెడ్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది.

ఆశాజనకంగా జీడిపూత

- అధిక దిగుబడి వచ్చే అవకాశం
- గిరిజన రైతుల్లో ఆనందం
- జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని విన్నపం



6లో

జన జాతర

- శంబర పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఆరోవారం కూడా తగ్గని రద్దీ



6లో

ఆడపిల్లలను చదివిద్దాం


- ఐసీడీఎస్ పీవో కనకదుర్గ
- పార్వతీపురంలో కొవ్వొత్తుల ర్యాలీ



6లో

67 కేంద్రాల్లో పది పరీక్షలు: డీఈవో

సాలూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 17 నుంచి 31 వరకు 67 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో ఎస్.తిరుపతినాయుడు తెలిపారు. మంగళవారం మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 220 పాఠశాలల నుంచి 10,458 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలను రాయను న్నారన్నారు. మూడు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని తెలి పారు. లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాఠశాలల్లో ఆగిన నాడు-నేడు పనులపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు. పీఎంశ్రీ పథకంలో 19 పాఠశాలల్లో వివిధ సౌకర్యాలు కల్పించ నున్నామని తెలిపారు. ఉపాధి నిధులతో పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో

వాట్సాప్‌లో టెన్త్ హాల్ టిక్కెట్లు

వాట్సాప్ ద్వారా పదో తరగతి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునేలా ఎస్ఎస్‌సీ బోర్డు అవకాశం కల్పించింది. వాట్సాప్‌లో (మన మిత్ర) 95523 00009 నెంబరు ద్వారా విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను పొందొచ్చు. కాగా వెబ్‌సైట్ నుంచి కూడా వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలని అధికార వర్గాలు తెలిపాయి.

రీ సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

గరుగుబిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం దళాయివలసలో నిర్వహించిన రీసర్వేను పరిశీలించారు. ముందుగా పైలెట్ గ్రామాల్లో పూర్తయిన తర్వాత మిగిలిన ప్రాంతాల్లో ప్రణాళికా బద్ధంగా రీ సర్వే చేపడతామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులకు ఫారం-19 నోటీసులు ఇచ్చిన తర్వాత వారి సమక్షంలోనే రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రోవల్ సాయంలో కచ్చితమైన హద్దులను నిర్ణయించాలని, గ్రామ కంఠం భూములను కూడా గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల పరిధిలో చెరువులను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. దీనిపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్థులో మాట్లాడి రీ సర్వే తీరుపై వివరాలు సేకరించారు. తహసీల్దార్ వి.బాల, మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాల రావు, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్‌వో శ్రీనివాసరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

పార్వతీపురం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసే అవకాశం ఉన్నందున మహిళా దినోత్సవానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. జిల్లాలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహిళలను గుర్తించాలని, వారి విజయగాథలతో ఇతరుల్లో స్ఫూర్తి నింపాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే మహిళలు, ఇతరులకు రోల్ మోడల్‌గా నిలిచిన వారిని సన్మానించాలన్నారు. ప్రభుత్వ సాయంతో ఆర్థికంగా ఎదిగిన మహిళలు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలని తెలిపారు. బ్యాంకు లింకేజీలను ఈ వేడుకల్లో ప్రమోట్ చేయాలని సూచించారు. మెగా చెక్కుల పంపిణీ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమా వేశంలో ఏఎస్పీ అంకిత్ సురానా, డీఆర్‌వో హేమలత, జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కనకదుర్గ, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కరుణాకర్ పాల్గొన్నారు.



దళాయివలసలో రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వారివి వేర్వేరు ప్రాంతాలు. సొంతూరులో ఉపాధి కరువై పొట్టకూటి కోసం కుటుంబాలతో సహా ఇక్కడకు వలస వచ్చారు. ఈ ప్రాంతంలో వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొందరు వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తుంటే.. మరికొందరు టార్పాలిన్లు అమ్ముతుంటారు.. ఇంకొందరు చెరకు తోటలు నరికే కూలీలుగా పని చేస్తున్నారు. రోజంతా కష్టపడుతూ ఆ వచ్చిన డబ్బులతో బతుకు బండి లాగుతున్నారు.


సంతకవిటి కూడలిలో బస చేసిన మధ్యప్రదేశ్ వాసులు

బతుకు బాట..మెతుకు వేట

- వ్యవసాయ పనిముట్ల తయారీలో మధ్యప్రదేశ్, రాజస్థాన్ వాసులు
- వాటిని గ్రామాల్లో విక్రయిస్తూ జీవనం
- టార్పాలిన్లు అద్దెకిస్తున్న పల్నాడు వ్యక్తులు
- చెరకు పనిలో తుని, అన్నవరం కూలీలు

సంతకవిటి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కొందరు తమ కుటుంబాలతో సహా సంతకవిటి మండలానికి వచ్చి జీవిస్తున్నారు. కష్టపడే వారికి భాష, ప్రాంతంతో సంబంధం లేదని, చెమట చిందిస్తేనే నాలుగు వేళ్లూ నోటిలోకి వెళ్తాయని నిరూపిస్తున్నారు. ఇక్కడ వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ముందుకు సాగుతున్నారు. కత్తి, గొడ్డలి, గునపం, కత్తిపీటలు వంటి పనిముట్లు తయారు చేసి వాటిని విక్రయిస్తు న్నారు. పనిముట్ల తయారీలో పురుషులతో పాటు మహిళలు కూడా చెమట చిందిస్తున్నారు. ఇనుమును కరిగించే సమయంలో మగవారితో సమానంగా సమ్మెట దెబ్బలు వేయడం, కొలిమిని మండించడం, తయారు చేసిన వస్తువులను విక్రయించడం వంటి పనులు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కోచోట రెండు, మూడు రోజులు ఉండి మరోచోటకు వలస వెళ్తున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో ఇలా వస్తున్న కుటుంబాలు మళ్లీ హోలీ పండగ సమయానికి తమ సొంతూళ్లకు వెళ్లిపోతాయి.


సంతకవిటిలో చెరకు పంటను కొడుతున్న అన్నవరం కూలీలు


కత్తులు, గొడ్డళ్లు, కత్తిపీటలను తయారు చేస్తున్న దృశ్యం

టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ..

అపరాలు పంట చేతికి వచ్చే సమయం కావడంతో పల్నాడు జిల్లా నరసారావుపేట నుంచి కొందరు వ్యక్తులు ఈ ప్రాంతానికి వలస వచ్చారు. ఊరూరా తిరుగుతూ టార్పాలిన్లను అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. అపరాలు సీజన్ కావడంతో టార్పాలిన్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పంటను కల్లాలకు తరలించకుండా రైతులు పొలాల్లోనే టార్పాలిన్లు వేసి నూర్పు చేస్తున్నారు. దీంతో రైతులకు శ్రమ తగ్గింది.


అద్దెకు ఇచ్చేందుకు టార్పాలిన్లను సిద్ధం చేసిన నాగేశ్వరరావు

చెరకు నరికేందుకు..

నాగావళి నదీ తీర గ్రామాల్లో చెరకు పంటను అధికంగా పండిస్తుంటారు. ఈ చెరకు తోటలను నరికి రేగిడి మండలం సంకిలిలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు తుని, అన్నవరం తదితర ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడకు చేరుకున్నారు. ప్రతిరోజూ చెరకు కొట్టి ట్రాక్టర్లకు ఎక్కిస్తుంటారు. వీరికి టన్నులను బట్టి ఫ్యాక్టరీ వారు డబ్బులు చెల్లిస్తుంటారు. గ్రామాల్లో రైతులు వీరికి షెల్టర్ ఇవ్వడంతో పాటు వంట పాత్రలు, తదితర వస్తువులు సమకూరుస్తుంటారు.

ప్రతి ఏటా వస్తాం



జీవనోపాధి కోసం ప్రతి ఏటా ఈ ప్రాంతానికి వలస వస్తుంటాం. ఒక్కో గ్రామంలో తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి విక్రయిస్తుంటాం. ఆ వచ్చిన డబ్బులతో జీవనం కొనసాగిస్తున్నాం. రైతులు మా పనిముట్లను ఆదరిస్తున్నారు.

-సామ్‌లాల్, భోపాల్, మధ్యప్రదేశ్

టార్పాలిన్లకు గిరాకీ

ఈ ప్రాంతంలో టార్పాలిన్లకు మంచి గిరాకీ ఉంది. దీంతో ప్రతి ఏటా ఇక్కడకు వాటిని తీసుకువస్తాం. దాదాపు నెల రోజుల పాటు ఇక్కడే ఉండి వాటిని అద్దెకు ఇచ్చి జీవనోపాధి సాగిస్తున్నాం.

-యు.నాగేశ్వరరావు, నరసారావుపేట, పల్నాడు జిల్లా

వైద్య విద్యార్థులకు న్యాయం చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి, కరోనా సమయంలో రాష్ట్రంలో సేవలు అందించిన వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. మంగళవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో చదువు తున్న ఇటువంటి విద్యార్థులు రాష్ట్రంలో 1,500 మంది ఉండగా, విజయనగరం నియోజకవర్గంలో 130 మంది ఉన్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. వీరంతా ఉక్రెయిన్, రష్యా యుద్ధ సమయంలో ఆన్‌లైన్ ద్వారా వైద్య విద్యను అభ్యసించారని చెప్పారు. ప్రస్తుతం వారి కోర్సులు పూర్తయిన నేపథ్యంలో వారికి న్యాయం చేయాలని స్పీకర్ దృష్టికి ఆమె తీసుకువచ్చారు.

వైసీపీ అక్రమాలపై విచారణ కమిటీ వేయాలి


- అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే విజయచంద్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పార్వతీపురం నియోజకవర్గంలో ఆ పార్టీ ఎమ్మెల్యే చేసిన భూ దందాలు, ఇతర అక్రమాలపై విచారణ చేపట్టేందుకు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర కోరారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని భూ అక్రమాలు పార్వతీపురం నియోజకవర్గంలో జరిగాయన్నారు. తహసీల్దార్ సంతకాన్ని కూడా అప్పటి ఎమ్మెల్యే ఫోర్జరీ చేశారన్నారు. పార్వతీపురం పట్టణ పరిధిలో గతంలో 70 చెరువులు ఉండేవని, ప్రస్తుతం 14 మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన చెరువులు కబ్జాలకు గురయ్యాయన్నారు. ఇక్కడ ప్లాట్లు ఏర్పాటు చేసి పేదలకు విక్రయించారన్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించిన భూ సమస్యల వివరాలను తెలియజేయాలని రెవెన్యూ శాఖా మంత్రిని అడిగారు.

ఆశాజనకంగా జీడిపూత

- అధిక దిగుబడి వచ్చే అవకాశం
- గిరిజన రైతుల్లో ఆనందం
- జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని విన్నపం


పూతతో ఉన్న జీడితోట

గుమ్మలక్ష్మీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాలో జీడి పూత ఆశాజనకంగా ఉంది. మంచు, తెగుళ్లను తట్టుకుని పూత నిలబడింది. ఏ చెట్టు చూసినా పూత విరబూసి కనిపిస్తోంది. దీంతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 60 వేల హెక్టార్లలో జీడి తోటలు ఉన్నాయి. 1986 నుంచే గిరిజన రైతులు జీడి తోటలు పెంచేలా ఐటీడీఏ కృషి చేస్తోంది. 1994లో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్‌పీ సిసోడియా ఐటీడీఏ పరిధిలో 20 వేల ఎకరాల్లో రైతులతో జీడి మొక్కలు వేయించారు. ఈ పథకం విజయవంతం కావడంతో గిరిజన రైతులు ఆదాయం పెరిగింది. తోటి గిరిజన రైతులను చూసి మిగతా రైతులు కూడా తమ పోడు వ్యవసాయంలో మెట్ట భూముల్లో జీడి సాగుకు ఆసక్తి కనబరిచారు. ఆ తర్వాత వచ్చిన ఐటీడీఏ పీవోలు కూడా జీడి తోటల పెంపకానికి నిధులు మంజూరు చేశారు. ఇక్కడి జీడి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జీడి సాగులో గిరిజన రైతులు ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించరు. ఈ కారణంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడి జీడి పిక్కలను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి లారీల్లో తరలించుకుపోతుంటారు. ప్రస్తుతం కిలో జీడి పిక్కల ధర రూ.110 నుంచి రూ.120 వరకు పలుకుతుంది. ఈ ఏడాది జీడిపూత సంతృప్తికరంగా ఉంది. ఈ పూత నిలబడితే పెద్ద ఎత్తున దిగుబడి ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే మంచి గిట్టుబాటు ధరతో పాటు గిరిజన యువతకు ఉపాధి దొరుకుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట కేంద్రాలుగా జీడి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

జిల్లాలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించాం. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

- ఆరిక విప్లవకుమార్, టీడీపీ నాయకుడు

జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

గిరిజన సహకార సంస్థ ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి. అలాగే గిట్టుబాటు ధర కూడా కల్పించాలి. అప్పుడే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

-మడంగి రమణ, గిరిజన సంఘం నాయకుడు

జన జాతర

- శంబర పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఆరోవారం కూడా తగ్గని రద్దీ



క్యూలైన్‌లో ఉన్న భక్తులు, పూజలందుకున్న శంబర పోలమాంబ

మక్కువ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. ఆరోవారం కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో చదురుగుడి, వనంగుడి క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఎంపీ కలిశెట్టికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

ముగిసిన కనకమహాలక్ష్మి జాతర

చీపురుపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కనకమహాలక్ష్మి జాతర మంగళవారం ముగిసింది. చివరి రోజు అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, తదితరులు దర్శించుకున్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

- ఐసీడీఎస్ పీవో కనకదుర్గ
- పార్వతీపురంలో కొవ్వొత్తుల ర్యాలీ

బెలగాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను చదివిస్తే.. కుటుంబమంతటికీ ప్రయోజనం చేకూరుతుందని ఐసీడీఎస్ పీవో టి.కనకదుర్గ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. 'ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం' అని నినాదాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కుటుంబంలో మగపిల్లలతో పాటు ఆడబిడ్డలను సమానంగా చూడాలని, అన్నింటిలోనూ ప్రోత్సహించాలని తెలిపారు. నేటి మహిళలు తమ ప్రతిభతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

7న ఎల్లమ్మ సిరిమానోత్సవం

● వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన సేవా కమిటీ ప్రతినిధులు

విజయనగరం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిరులతల్లి ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ సంగీత కళాశాల ఎదుట ఉన్న ఆలయం వద్ద ఈనెల 7న ఎల్లమ్మతల్లికి సిరిమానోత్సవాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం ఆలయం ఎదుట సిరిమానోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఎల్లమాంబ సేవా కమిటీ ప్రతినిధులు ప్రసాద్, రమణ, సత్తిబాబు, వాలీ, ఉమ తదితరులు ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు ప్రతిరోజు రాత్రి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. భక్తులు, నగర ప్రజలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సేవా కమిటీ ప్రతినిధులు, భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొండవెలగాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. కొండవెలగాడ, చంద్రంపేట, తాళ్లపూడిపేట, టెక్కలి, ఎల్ఎన్.పురం, తుమ్మలపేట, చినబూరాడపేట, పారసాం, గెద్దపేట, పెదబూరాడపేట, గుర్ల మండలంలోని ఆనందపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని డీఈఈ తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా పోటీలు

విజయనగరం క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలను ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలో 8న నిర్వహించే ముగింపు వేడుకల్లో ఎస్పీ బహుమతి ప్రదానం చేయనున్నారు.

సంగమేశ్వరుడి ఆదాయం రూ.1.32 లక్షలు

వంగర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వస్వామికి హుండీల ద్వారా రూ.1,32,369 ఆదాయం సమకూరింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం దేవాదాయ శాఖ ఈవో శ్యామలరావు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గతంతో పోలిస్తే హుండీ ఆదాయం రూ.40 వేలు పెరిగిందని ఈవో తెలిపారు. అలాగే ప్రసాద విక్రయాలతో రూ.96 వేలు సమకూరిందన్నారు.

రక్తదానం చేసిన ఉద్యోగులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయబ్లడ్ బ్యాంకులో మంగళవారం విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటైంది. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అరబిందో ఫార్మా కంపెనీకి చెందిన 216 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అరబిందో ఫార్మా కంపెనీ హెచ్ఆర్ తిరుపతిరావు మాట్లాడుతూ ఏటా భద్రతా వారోత్సవాల్లో భాగంగా కంపెనీ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఇల్తామస్, సంస్థ ప్రతినిదులు శివవర్మ, అశోక్, సాయి, శివ పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావద్దు

కొత్తవలస, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను రాసి మంచి ఫలితాలను సాధించాలని డిప్యూటీ డీఈవో కె.వెంకటరమణ టెన్త్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని కంటకాపల్లి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. బట్టీపట్టి చదవకుండా పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుని రాయడం మేలు అన్నారు. ఆయనతో పాటు హెచ్ఎం వి.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులకు సహకరించండి

శృంగవరపుకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీలోని రేగ పుణ్యగిరి రోడ్డు పనులకు సహకరించాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు తహసీల్దారును కోరారు. మంగళవారం గిరిజనులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ భరత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అటవీ శాఖ అనుమతులు వచ్చేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

గాదె విజయంపై మాజీ ఎమ్మెల్యే హర్షం

విజయనగరం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల్లో విజయం సాధించిన గాదె శ్రీనివాసులునాయుడును మాజీ ఎమ్మెల్యే గీత ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ ఎమ్మెల్సీగా విజయం సాధించిన నేపథ్యంలో శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలను మరింతగా విన్పించాలని కోరారు.

పంట మార్పిడితో నేల సారం

గజపతినగరం మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఏటా ఖరీఫ్, రబీల్లో పంటల మార్పిడితో నేల సారవంతం అవుతుందని ఏడీఏ మహరాజన్ అన్నారు. మంగళవారం మండలంలోని జిన్నాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలిచ్చారు. ఆయనతో పాటు ఉద్యానవన అధికారి రాజశేఖర్ , జిల్లా వనరుల కేంద్రం అధికారి గోవిందమ్మ, ఏవో ధనలక్ష్మి, సూర్యారావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ఎన్ఎంయూ లక్ష్యమని, ఎన్ఎంయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ భవనంలో జోనల్ మహాసభను నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పీవీ మోహన్, బీఎస్ రాములు, ప్రదీప్‌కుమార్, ఎంవీఆర్ మూర్తి, పీజీ రాఫెల్ ఉన్నారు.

కనీస వేతనాలు ఇవ్వండి

రాజాం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆశ వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాం అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో మంగళవారం ధర్నా నిర్వహించారు.పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి అందజేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

జామి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగి షుగర్స్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని, ఎవ్వరూ అధైర్యపడొద్దని మంత్రి కొండపల్లి శ్రీనువాస్ భరోసా ఇచ్చారు. మంగళవారం లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో భీమసింగి షుగర్స్ కార్మికులు మంత్రిని విజయవాడ సచివాలయంలో కలిశారు. త్వరలోనే బకాయిలు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు, టీడీపీ నేత స్వామినాయుడు ఉన్నారు.


మంత్రి శ్రీనివాస్‌ను కలిసిన కార్మికులు

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జనసైనికులు, వీరమహిళలు జయప్రదం చేయాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, జనసేన నాయకుడు గురాన అయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పాల్‌నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యశస్విని మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులు నడుచుకోవాలన్నారు. జనసేన నాయకుడు గురాన అయ్యలు మాట్లాడుతూ తనకు ఆవిర్భావ దినోత్సవ కమిటీలో, పాయకరావుపేట నియోజకవర్గంలో సమన్వయం చేసే అవకాశం పార్టీ కల్పించిందన్నారు. మాజీ మంత్రి పడాల అరుణ మాట్లాడుతూజనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. ఆయన అడుగుజాడల్లో మనమంతా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

రాజాం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, నాయకులు గుడివాడ నాగరాజు, సామంతుల రమణనాయుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు తదితరులు దర్శించుకున్నారు.

వేధింపులు, భద్రతపై అవగాహన

నెల్లిమర్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల పట్ల వేధింపులు, భద్రతపై జరజాపుపేట జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఎస్ఐ బి.గణేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వీయరక్షణ అవసరమన్నారు. పని ప్రదేశాల్లో భద్రతపై దృష్టి సారించి వేధింపులకు గురికాకుండా ఎదుర్కొవాలన్నారు. సమాజంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్ఐ అన్నారు.

పీఆర్‌టీయూ శ్రేణుల సంబరాలు

మెరకముడిదాం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడంతో మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం పీఆర్‌టీయూ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. కార్యక్రమంలో స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, సంఘ నాయకులు పాల్గొని కేక్ కట్ చేశారు.


కేక్ కట్ చేస్తున్న సంఘ నాయకులు

ఇష్టంగా చదవండి

శృంగవరపుకోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంగా చదవాలని విశాఖ ప్రభుత్వ మానసిక ఆసుపత్రి కౌన్సిలర్ డాక్టర్ గేదల సత్తిబాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు పరీక్షల సమయంలో ఒత్తిడిని తగ్గించుకోవడంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బాలమణి, స్వప్న, శ్రీనివాసరావు తదితరులున్నారు.

పరిహారంపై చెల్లింపులో జాప్యంపై ఆగ్రహం

కొత్తవలస, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో మండలంలోని రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై ఆర్డీవో కీర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కొత్తవలసలోని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమెకు గ్రీన్ ఫీల్డ్ హైవే భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం అందలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్పందించారు. రెవెన్యూ అధికారులు రికార్డులు తయారు చేయడంలో నిర్లక్ష్యం వహించారని గుర్తించి తహసీల్దార్ నీలకంఠరావు, సంబంధిత వీఆర్వోపై మండిపడ్డారు. ముందు రైతులకు న్యాయం చేసిన తరువాతే మిగిలిన పనులు చేయాలన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో

పీటీసీలో న్యాయ విద్యార్థులకు శిక్షణ

విజయనగరం క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కళాశాలలో న్యూ క్రిమినల్ చట్టాలుపై న్యాయశాస్త్రం చివరి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న శిక్షణను మంగళవారం ప్రిన్సిపాల్ రామచంద్రరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో క్రిమినల్ ప్రొసీజర్, ఎవిడెన్స్ యాక్టు, ఇంటరాగేషన్ టెక్నిక్స్, కొలబ్రేషన్ బిట్వీన్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ లీగల్ ప్రాక్టిషనర్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, బీఎస్పీలు శ్రీకాంత్, రమేశ్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


న్యాయ విద్యార్థులతో పీటీసీ ప్రిన్సిపాల్

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి

విజయనగరం క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా రైళ్లు, ప్లాట్‌ఫాంలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని జీఆర్‌పీ ఇన్‌స్పెక్టరు ఎ.రవికుమార్ ఆదేశించారు. మంగళవారం విజయనగరం జీఆర్‌పీ సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశాటరు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రైళ్లల్లో అనుమానితులను ప్రశ్నించాలన్నారు. ప్రయాణికులను అప్రమత్తం చేయాలన్నారు. పాత నేరస్థులను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. విజయనగరం, బొబ్బిలి, పార్వతీ పురం రైల్వేస్టేషన్లలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. విజయనగరం జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు ఉన్నారు.

రోగ నివారణకు ఆయుర్వేదం మేలు

నెల్లిమర్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రోగ నివారణకు ఆయుర్వేద వైద్యం ఎంతో మేలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యాధులు వచ్చిన తరువాత జాగ్రత్తలు తీసుకోవడం కంటే అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆయుర్వేదంలో పంచకర్మ బాగా ప్రసిద్ధి చెందిందన్నారు. వాటిని పాటించడం ద్వారా వ్యాధులను రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మొహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, డాక్టర్ ఆయేష్‌కాంత్‌జేనా, ప్రొఫెసర్ ఎంఎల్ఎస్, ఆచార్యులు పాల్గొన్నారు.

ముగిసిన అక్కినేని శతజయంతి వేడుకలు

విజయనగరం బాబామెట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండు రోజులుగా గురజాడ కళాభారతి వేదికగా నిర్వహిస్తున్న అక్కినేని శతజయంతి వేడుకలు మంగళవారం ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రతిరోజు సాంఘిక నాటకాలను ప్రదర్శించారు. చివరిరోజు శ్రీ కాళహస్తీశ్వర మహాత్యం పద్య నాటకాన్ని ప్రదర్శించారు. మీగడ రామలింగస్వామి రచించిన నాటకాన్ని మీగడ మల్లికార్జునస్వామి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా విజయనగరానికి చెందిన రచయిత, సాహితీవేత్త ఎస్‌వీఆర్‌ఎం రాజుని సన్మానించారు. కార్యక్రమంలో అక్కినేని సాంస్కృతిక సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎస్‌వీఆర్‌ఎం రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

రేపటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

విజయనగరం బాబామెట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రింగురోడ్డు లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 6 నుంచి 10 వరకూ ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ ప్రవచనకర్త అరు బాజీ ప్రవచిస్తారన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బైక్ నుంచి కిందపడి యువకుడి మృతి

క్రైంన్యూస్

చీపురుపల్లి, గరివిడి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడుముల బంగారునాయుడు (32) మృతి చెందాడు. పోలీసుల అందించిన వివరాల మేరకు గరివిడి మండలంలోని రేగటి గ్రామానికి చెందిన కడుముల బంగారునాయుడు, శనపతి రాములు బైక్‌పై అమ్మవారి జాతరకు చీపురుపల్లి వస్తున్నారు. మెటారు బైక్ డ్రైవ్ చేస్తున్న రాము, ఆంజనేయపురం వద్ద సడన్‌గా బ్రేక్ వేయడంతో, వెనుకన కూర్చున్న బంగారునాయుడు బైక్ నుంచి తూలి రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో ఆ యన తలకు బలమైన గాయమయ్యింది. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బంగారు నాయుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల కిందటే బంగారునాయుడు మండలంలో దేవాడలో గల ఓ మైనింగ్ పరిశ్రమ లో ఉద్యోగంలో చేరాడు. అందివచ్చిన ఏకైక కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు సన్యాసప్పడు, వరలక్ష్మి కన్నీరు మున్నీరయ్యారు.


బంగారునాయుడు (ఫైల్)

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

సాలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుగ్గన వీధిలో సోమవారం రాత్రి అప్పుల బాధతో షేక్ ఖలీల్(29) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఖలీల్ ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఎప్పటిలాగే ఇంటికి వచ్చి తన రూంలోకి వెళ్లిన వ్యక్తి సాయంత్రం వరకూ బయటకు రాలేదు. దీంతో కుటుంబీకులు రాత్రి తలుపు తీసి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబీకులు అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి భువనేశ్వరీ భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి..

కొమరాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలానికి చెందిన నాగల్ల సింహాచలం(56) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. సింహాచలం గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. అయితే తన కుమారుడి వైవాహిక జీవితం సరిగా లేని కారణంగా మనస్థాపంతో మంగళవారం ఉదయం గుమడ గ్రామ సమీపంలో గొర్రెల మంద వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

విజయనగరం క్రైమ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాహనదారులు హెల్మెట్ ధరిస్తేనే రవాణా శాఖ కార్యాలయంలోకి అనుమతిస్తామని రవాణా శాఖ ఉపకమిషనర్ మణికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రవాణా శాఖ కార్యాలయంలో వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ ఆధ్వర్యంలో రోజూ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. పట్టు బడితే జరిమానాతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ మురళీకృష్ణ, రవిశంకర ప్రసాద్, శివరామగోపాల్, శ్రావ్య, ఉష తదితురులు పాల్గొన్నారు.

జీవో 2131ని రద్దు చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆటో, టాటా మేజిక్, ప్యాసింజర్ వాహనాలపై గుదిబండగా మారిన జీవో నెంబరు 2131ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్యాసింజర్ వాహనాలపై గ్రీన్ రోడ్ లేబర్ ట్యాక్స్‌లు వేస్తూ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ భారీగా పెంచి డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాహనమిత్ర ద్వారా రూ.15 వేలు ఇవ్వాలని, నూతన మోటారు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రంగనాథ్, అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ కె.భీముడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పాత బస్‌స్టాండ్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ధర్నా నిర్వహించింది. వాహన మిత్ర ద్వారా రూ. 15వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బి.సురేష్, పండు, కృష్ణ, అయ్యంనాయుడు తదితరులున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

వంగర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మడ్డువలస రిజార్వాయర్‌తో పాటు రిజర్వాయర్ నిర్వాసిత గ్రామం పటువర్ధనంలో పర్యటించారు. ప్రభుత్వం నిర్వాసితులకు పునరావాసం, మౌలిక సదుపాలయను కల్పించడంలో విఫలమైందన్నారు. పునరావాస ప్యాకేజీ ఎందుకు అమలు కాలేదని మండిపడ్డారు. ఇక్కడి నిర్వాసితుల సమస్యలను జాతీయ బీసీ కమిషన్‌కు వివరించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పోరాట కమిటీ అధ్యక్షుడు నల్ల కాశినాయుడు, నల్ల సూర్యం ఉన్నారు.

కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు

విజయనగరం రింగురోడ్డు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయడంతో పాటు వాటికి రాబిస్ వ్యాక్సినేషన్ చేస్తున్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో నగరపాలక సిబ్బంది వివిధ ప్రాంతాల్లో కుక్కలను బంధించారు. వాటిని కొత్తపేటలోని డాగ్ స్టెరిలేజేషన్ సెంటర్‌కు తరలించారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్యంగా ఉన్న వాటిని తిరిగి వదిలేయనున్నారు.

మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నెల్లిమర్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడలో గల విజయరామరాజు కాలనీకి చెందిన ఉజ్జి లక్ష్మి మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె దహన సంస్కారాల నిర్వహణకు కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న విజయదుర్గా యూత్, కేవీడీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ముందుకు వచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ20 వేలు ఆర్థిక సాయం చేశారు.

కోమటిపల్లి భూసమస్యపై విచారణ పూర్తి

విజయనగరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దత్తి రాజేరు మండలం కోమటిపల్లిలో భూ సమస్యపై విచారణ పూర్తయింది. దళితుల అనుభవంలో ఉన్న భూమి ఒక వ్యక్తి కబ్జా చేస్తున్నారని ఫిబ్రవరి 17న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. దత్తిరాజేరు తహసీల్దారు, రెవెన్యూ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో కోమటిపల్లిలో సర్వే నెంబరు 56/1 1.46 సెంట్లు రైతువారీ పుంజిగా నమోదై ఉందని తేల్చారు. ఎఫ్ఎంవో, ఫెయిర్ అడంగల్, సెటిల్‌మెంట్ నమోదు అయినట్టు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడు వాడ అప్పన్నతో పాటు నౌదసరి సోంబాబు, బౌరుబిల్లి సన్యాసి, బౌరుబిల్లి రామునాయుడు, బౌరుబిల్లి అప్పలనాయుడు, పాదం సన్యాసిలకు సదరు భూమిపై ఎలాంటి హక్కులు లేవని, పంచాయతీ పన్నులు చెల్లించలేదని విచారణలో తెలిందని తెలిపారు. సదరు భూమి భూస్థితి గ్రామంగా ఉన్నందున సమస్య పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోకి వెళ్లిందన్నారు. దాంతో సదరు భూమిపైకి ఇరువర్గాలు వెళ్లవద్దని తెలియజేసినట్టు తహశీల్దారు.. కలెక్టరుకు నివేదిక అందజేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెట్లకొమ్మలను తొలగించారు..

భోగాపురం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయం సమీపంలోవిద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలను ఆ శాఖ సిబ్బంది మంగళవారం తొలగించారు. చెట్ల కొమ్మల నుంచి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని 'నిర్వహణ లేక.. చెట్ల కొమ్మలు తొలగించక..' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్‌వలీ స్పందించారు. చెట్ల కొమ్మలను తొలగించే ఏర్పాటు చేయించారు.


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

వాహనాలు నిలిపితే చర్యలు

భోగాపురం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సీఐ ఎన్‌వీ ప్రభాకర్ చర్యలు చేపట్టారు. మంగళవారం ట్రాఫిక్ సమస్య లేకుండా అక్కడ ఏర్పాట్లు చేశారు. 'రహదారిపైనే వాహనాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణతో పాటు పెద్దవీధిలో వాహనాలను నిలుపుదల చేయకుండా చర్యలు చేపట్టారు. రహదారిపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తామని వాహనదారులకు హెచ్చరించారు.


ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఏఎస్ఐ తవుడు

రిజర్వ్ ఫారెస్ట్ పరిధి.. కానరాని పర్యాటక అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

పనులు చేపడతామన్నారు. 'సున్నపుగెడ్డ జలపాతానికి వెళ్లే మార్గంలో రాళ్లతో పిట్చింగ్ వేసి రహదారి ఏర్పాటు చేస్తాం. నీరు పారే ప్రదేశాల్లో చెక్కలతో రైలింగ్ నిర్మిస్తాం. అడవిలో దొరికే చెక్కలతో బల్లలు ఏర్పాటు చేసి పర్యాటకులకు కొత్త అనుభూతిని అందిస్తాం. రెండవ విడతలో ఈ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.10లక్షలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. ఈ నెలాఖరు నాటికి నిధులు మంజూరైతే వీఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో పనులు చేపడతాం. అడ్డాకులగూడ ప్రాంతంలో 10 హెక్టార్లలో నగరవాటిక అనే వనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. దీనికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.40లక్షలకు ప్రతిపాదనలు పంపించాం. ఇందులో రాచవనం, సుగ్రీవవనం, నక్షత్రవనం వంటి వాటిని పెంచతాం. మొత్తంగా 27 రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పుతాం. పొల్ల వ్యూ పాయింట్ అందాలను తీర్చిదిద్దేందుకు ఇంకా ఎటువంటి ప్రణాళికలు రూపొందించలేదు. అటవీ సంపదను కాపాడుకుంటూ ఏకో ఫ్రెండ్లీ మెటీరియల్‌తో పర్యాటక అభివృద్ధి పనులు చేస్తాం.' అని తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

టీచర్ల సీనియారిటీ జాబితాను పూర్తిగా క్రమబద్ధీకరిస్తోంది. నెలరోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, ఐటీ సెల్ అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు. డీఎస్సీలు 1982, 1984, 1989, 1994 నుంచి 1988 వరకూ, 2000, 2002 నుంచి 2004 వరకూ, 2006, 2008, 2012, 2014, 2018 టీచర్ల వివరాలు సేకరించి, సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు.

నష్టపోకూడదు

బదిలీల్లో నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులు నష్టపోకుండా చూడాలి. సిన్సియర్‌గా ఉన్నా ఒక్కోసారి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. బదిలీ చట్టంలో స్పౌజ్‌కు ప్రాధాన్యతనిస్తునే నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా మార్గ దర్శకాలుండాలి. ఎస్జీటీ ఉపాధ్యాయులకు మండలస్థాయిలో కౌన్సిలింగ్ నిర్వహించాలి. జిల్లాలో ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రత్యేక ఆప్షన్ ఇచ్చి కౌన్సిలింగ్ నిర్వహించాలి.

- ఇండుపూరి గున్నరాజు, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి

పారదర్శకంగా నిర్వహించాలి

ఉపాధ్యాయ బదిలీల కోసం ప్రభుత్వం చట్టం తీసుకురావడం శుభపరిణామం. ఏటా తప్పనిసరిగా బదిలీలు నిర్వహించాలి. రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలి. తగిన సమయమివ్వాలి. సిఫారసులకు చోటు కల్పించకూడదు.

- ఏజీఎస్ గణపతిరావు, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు

అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయండి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీసీసీ బ్రాంచి కార్యాలయంలో స్టాక్ పాయింట్‌ను జీసీసీ డీఎం మహేంద్ర మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది వారి శాండీ పాయింట్స్, డిపో పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. ఏ రోజు కొనుగోలు చేసిన ఉత్పత్తులను ఆ రోజే గొడైన్లకు తరలించాలన్నారు. చింతపండు కిలో రూ.36, అడవి తేనె రూ.300, నల్లజీడి కిలో రూ.35, అదే విధంగా కరక్కాయలు రూ.20, రాగి చోలులు రూ.35, గ్రేడ్-1 ముసిడిగ పిక్కలు రూ.100, పసుపు కిలో రూ.100 పెంచామని చెప్పారు. బ్రాంచి మేనేజర్ కృష్ణ ప్రసాదరావు, గొడౌన్ ఇన్‌చార్జి సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్టికల్చర్ నర్సరీ సందర్శన

గుమ్మలక్ష్మీపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేపాడు హార్టికల్చర్ నర్సరీ, శిక్షణా కేంద్రాన్ని పార్వతీపురం ఐటీడీఏ పీవో శ్రీవాత్సవ మంగళవారం సందర్శించారు. హార్టికల్చర్ పర్యాటక కేంద్రంగా మార్చడానికి కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. బోట్ రైడింగ్ జరిగే ప్రాంతాన్ని శుభ్రం చేయాలన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులపై ఇంజనీర్లతో చర్చించారు. 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చాణిక్య, అసిస్టెంట్ ఇంజనీర్ అప్పారావు ఉన్నారు.

సారా స్వాధీనం

కురుపాం, మార్చి4(ఆంధ్రజ్యోతి): చినమేరంగి గ్రామానికి చెందిన నాగో అవినాష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో 80 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా మంగళవారం కురుపాం పంచాయతీ పూతికవలస సమీపంలో పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఒడిశా, ఆంధ్ర సరిహద్దులో గల కెరడ గ్రామంలో మాధవ అనే వ్యక్తి నుంచి అవినాష్ సారా కొనుగోలు చేసి చినమేరంగి గ్రామానికి చెందిన మీసాల ఉపేంద్రకు సారా సరఫరా చేస్తున్నాడని చెప్పారు. ఈ మేరకు అవినాష్ తోపాటు ఉపేంద్రపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ



పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పాలకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డ్రగ్ స్టోర్, ల్యాబ్, ఓపీలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. ప్రైవేటు హెల్త్‌కేర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎం.సింగుపురం పీహెచ్‌పీని పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో సామాన్యులకు మేలు

బెలగాం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవలె ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. మంగళవారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2025-26పై మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెడ్డి పావని, ఓ ప్రైవేటు విద్యా సంస్థల అధినేత మణికుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎస్‌బీ రావు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజలకు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టారని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మర్రిపాడులో వైద్య శిబిరం

సీతంపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు గ్రామంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరంలో జెమ్స్, విజయ ఆసుపత్రుల వైద్యులు అందుబాటులో ఉంటారని ఎస్ఐ తెలిపారు.

మహిళలకు క్రీడా పోటీలు

ఒడిశా

రాయగడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అదనపు కలెక్టర్ నవీనచంద్ర నాయక్ ప్రారంభించారు. ఖోఖో, చిత్రలేఖనం, కబడ్డీ, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి మినాతిదేవ్, డిప్యూటీ కలెక్టర్ మధుస్మిత, అసిస్టెంట్ కలెక్టర్ బిచిత్ర సేఠి తదితరులు పాల్గొన్నారు.

ఈ దారిలో ప్రయాణం.. నరకం

- అధ్వానంగా మామిడిపల్లి- పెంట రహదారి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సంతకవిటి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆ దారిలో ప్రయాణం.. నరకప్రాయం.. నిత్యం బురదమయం.. అడుగడుగునా గోతులు.. వాహనచోదకులకు తప్పని అవస్థలు.. మరమ్మతులకు గురవుతున్న వాహనాలు.. ఇదీ సంతకవిటి మండలంలోని మామిడిపల్లి నుంచి పెంట గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి. ఈ రహదారి చాలా ఏళ్లగా గోతులమయంగానే దర్శనమిస్తోంది. ఈ దారిలో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు భయపడుతున్నారు. తమ వాహనాలు ఎప్పటికప్పుడే మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. దీనికితోడు పక్కనే ఉన్న పంట కాలువ నీరు ఎప్పటికప్పుడే రహదారి పైకి వచ్చేస్తోంది. దీంతో ఈ దారి బురదమయంగా తయారయ్యింది. ఈ దారిలో నిత్యం రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లింగాపురం, మామిడిపల్లి, పెంట, నాగులవలస తదితర గ్రామాల ప్రజలు ఆ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి దుస్థితిపై చాలా పర్యాయాలు పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో వచ్చినా అధికారులు, పాలకుల్లో కొంచెం కూడా చలనం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మామిడిపల్లి-పెంట రహదారి

వేగావతిలో ఇసుక తవ్వకాలను అరికట్టాలి

బొబ్బిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాడంగి మండలం గొల్లాది గ్రామానికి సమీపంలో గల వేగావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని ఆ గ్రామానికి చెందిన పెద్దలు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ రౌతు పుండరీకాక్ష, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మి రమేష్, శంకరరావు తదితరులు ఆర్డీవోకు సమస్యను వివరించారు. నదిలో ఇసుక కొరత కారణంగా బోర్ల వద్ద భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయన్నారు. ఫలితంగా సాగు, తాగునీటికి ఎద్దడి ఏర్పడిందన్నారు. దీనిపై ఆర్డీవో స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారం గాదెతోనే సాధ్యం

రామభద్రపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుతోనే సాధ్యమని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బొప్పే రవికుమార్ అన్నారు. శ్రీనివాసులునాయుడు గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఆయన స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో మిఠాయిలు పంచి పెట్టారు. ఏపీటీఎఫ్ నాయకులు డోకల రఘురాంనాయుడు, కాగాన సత్యారావు, కర్రి శ్రీనివాసరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు వైల్డ్‌లైఫ్ క్యాలెండర్ బహూకరణ

బొబ్బిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యనపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజులకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన వన్య ప్రాణులతో కూడిన క్యాలెండర్లను బహూకరించారు. వన్య ప్రాణులకు స్వయంగా తీసిన ఫోటోలతో కూడిన క్యాలెండర్లను మంగళవారం శాసనసభలో వారికి అందజేసినట్టు ఎమ్మెల్యే స్థానిక విలేకర్లకు ఫోన్‌లో చెప్పారు.



స్పీకర్‌కు క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పార్వతీపురంటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామనుజ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని బెలగాంలో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవ సేవే మానవ సేవ అన్నారు.



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చినజీయర్ స్వామి

రక్తదానం ప్రాణదానంతో సమానం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బెలగాం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం లైన్ మెన్ దివస్‌ను పురస్కరించుకుని ఏపీడీసీఎల్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించిన 'నేను సైతం' రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 89 యూనిట్లు రక్తాన్ని సేకరించినట్టు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ కె.గోపాలరావునాయుడు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రహదారిపై నిర్మాణ సామగ్రి ఉంచొద్దు

బొబ్బిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భవనాలు, ఇళ్లు నిర్మించుకునే వారు రోడ్లపై విచ్చలవిడిగా నిర్మాణ సామగ్రిని ఉంచితే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ఆమె పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. గౌడవీధిలోని రోడ్డుపై ఓ ఇంటి యజమాని ఇంటి నిర్మాణ సామగ్రిని వేయడంతో జనం రాకపోకలకు ఇబ్బంది కలుగుతుండడాన్ని ఆమె గుర్తించారు. ఎవరైనా రహదారులపై నిర్మాణ సామగ్రిని ఉంచితే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. తొలుత ఆమె స్థానిక మస్తరు కార్యాలయాన్ని సంద్శచారు. కార్మికుల హాజరుపై ఆరా తీశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, కొళాయిల పనితీరు, వీధిదీపాలు తదితర సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీకి వివిధ వర్గాలు చెల్లించాల్సిన ఫీజులు, పన్నుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. పలుచోట్ల పైపులైను లీకేజీలను ఆమె గుర్తించి వెంటనే వాటి ని సరిచేయాలని పైపులైన్ ఫిట్టర్‌ను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సోమేశ్వరరావు, శానిటరీ మేస్త్రీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించండి

గరుగుబిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్యం మెరుగుకు క్షేత్ర స్థాయిలో అవగాహన పెంపొందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం గరుగుబిల్లి పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ కిశోర బాలికలు పోషకాహార లోపం, రక్తహీనతకు గురవ్వకుండా సిబ్బంది సమిష్టి కృషి చేయాలన్నారు. గర్భిణుల్లో హైరిస్క్ సమస్యలు గుర్తించడంలో జాప్యం ఉండకూడదన్నారు. ఎన్‌సీడీ సర్వే గ్రామాల్లో ఏ మేరకు పూర్తి చేశారో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఎస్.సంతోష్‌కుమార్, సీహెచ్‌వో చిన్నమ్మి, ఎపెడిమిక్ ఈవో సత్తిబాబు, సూపర్‌వైజర్లు ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

- దళిత సంఘాల జేఏసీ డిమాండ్

పాలకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని పార్వతీపురం మన్యం జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాలకొండ పట్టణంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. అత్యున్నత పోలీస్ అధికారి అయిన పీవీ సునీల్‌కుమార్ విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. ప్రభుత్వాలు అధికారులపై వేధింపులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. మన్యం జిల్లా దళిత నాయకులు బత్తిన మోహన్‌రావు, దళిత సంఘాల నేతలు ఎద్దు లిల్లీపుష్పనాథం, నూతులపాటి భరత్‌భూషణ్, మడపల ప్రసాదరావు, తిర్లంగి ఉపేంద్ర, రాకోటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'కు తరలిరండి

బొబ్బిలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలపై ఈనెల 6న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఎదుట ఆశావర్కర్లతో ధర్నా నిర్వహించారు. వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రూపు ఇన్సూరెన్స్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీహెచ్‌సీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ● బాడంగి: ఆశా వర్కర్ల సమస్యలపై ఈనెల 6న చేపడుతున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక ఆశావర్కర్లతో కలిసి సీహెచ్‌సీ వైద్యుడికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ కార్యదర్శి ఎ.సురేష్, నాయకురాలు శశికళా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ● బలిజిపేట: ఆశా కార్యకర్తల సమస్యలపై ఈనెల 6న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు వి.లక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం పలు పీహెచ్‌సీ వైద్యులకు వినతిపత్రాలు అందజేశారు.



బొబ్బిలి: సీహెచ్‌సీ ముందు ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సభావేదిక నిర్మాణానికి సహకారం

సాలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి మండవిల్లి నారాయణరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.లక్షా 75వేలతో సభావేదిక నిర్మించారు. ఆ సభావేదికను డీఈవో నల్లా తిరుపతినాయుడు మంగళవారం ప్రారంభించారు. అనంతరం దాతను సన్మానించారు. డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పాల్గొనలేదు?

కురుపాం, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏపీలో జరిగిన ఉపాధ్యాయ ఎమెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పాల్గొనలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి.. కూటమి ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ఉందంటూ ఎక్స్ వేదికగా చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ట్వీట్ చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనకర పరిపాలన అందిస్తోందన్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏవిధంగా గెలిచారని ప్రశ్నించారు. వైసీపీకి ఆదరణ ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికలో ఎందుకు పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి తన ఆలోచన మార్చుకోవాలని ఆయన ట్వీట్ చేశారు.

న్యూస్ బాక్స్

ఇంటర్ పరీక్షలకు 562 మంది గైర్హాజరు

బెలగాం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు రెండో రోజు మంగళవారం 562 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు మొత్తం 9,437 మంది విద్యార్థులకు గాను 8,875 మంది హాజరయ్యారని చెప్పారు. జనరల్ విభాగంలో 6,488 మంది విద్యార్థులకు గాను 6,243 మంది, ఒకేషనల్ విభాగంలో 2,949 మంది విద్యార్థులకు గాను 2,632 మంది పరీక్షలకు హాజరవ్వగా, 562 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆమె వివరించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

బొబ్బిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక వాసు, గాయత్రి కళాశాలల్లో పరీక్షల తీరును పరిశీలించారు. కేంద్రాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, తాగునీరు తదితర సదుపాయాలను పరిశీలించారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కేంద్రాల పరిసరాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేసి ఉంచాలని ఆదేశించారు. తహసీల్దార్ మలపురెడ్డి శ్రీను, ఆర్ఐ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

బొబ్బిలి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు విద్యా శాఖ సన్నద్ధమవుతోందని ఎంఈవో ఎం.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ఆయన రంగరాయపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధి కోసం హెచ్ఎం నాగరాజుకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల విలీనం, మోడల్ స్కూల్ ఏర్పాటుపై గ్రామ పెద్దలతో చర్చించారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యను బట్టి మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నామని తెలిపారు.

పూర్వ విద్యార్థి వితరణ

బొబ్బిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 1990లో చదువుకున్న కె.కృష్ణకాంత్ అనే పూర్వ విద్యార్థి ఆదే పాఠశాలకు వంద కెరీర్ గైడెన్స్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో మంగళవారం వీటిని ప్రిన్సిపాల్ రఘునాథ్‌కు అందజేశారు. గురుకులంలో గల లైబ్రరీకి కూడా అదనంగా 20 పుస్తకాలను పంపిణీ చేశారు. గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జోగినాయుడు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

గరుగుబిల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో జి.పైడితల్లి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎ.గౌరీశంకర్‌లు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం వారు క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో ఏప్రిల్ 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం నుంచి గిరిజన యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు ఎల్విన్‌పేట సీఐ హరి, ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న యువకులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమను సంప్రదించవచ్చునన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.